క్లుప్తంగా

విద్యార్థినికి అభినందన



తపస్వి

వేములవాడరూరల్: వేములవాడ మండలంలోని హన్మాజీపేట జెడ్పీహెచ్ఎస్ విద్యార్థిని బుర్ర తపస్వి రాష్ట్రస్థాయి ఉపన్యాస పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల పీఈటీ వెంకటేశ్ తెలిపారు. క్విజ్, డ్రాయింగ్, స్పీచ్, కవిత్వం పోటీలు జిల్లాస్థాయిలో నిర్వహించారు. ఇందులో ప్రతిభ కనబర్చిన 90 మంది విద్యార్థులు ఎంపికకాగా అందులో తపస్వి ఉపన్యాస పోటీల్లో ప్రతిభ చూపి కన్సోలేషన్ బహుమతికి ఎంపికైనట్లు ఆయన తెలిపారు. ఎంపికైన వీరికి ఈనెల 28న హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో బహుమతులు అందజేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గ్రామస్తులు, ప్రజాప్రతినిధులు ఆమెను అభినందించారు.

ఐకమత్యం చాటాలి



మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ భిక్షపతి

గంభీరావుపేట: ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ నాయత్వంలో ముప్పై ఏళ్లుగా చేస్తున్న పోరాటం ఫలించబోతుందని, ఈ సమయంలో మాదిగలు, ఉపకులాల ప్రజలు ఐకమత్యంగా ఉండాలని ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ ఎలగందుల భిక్షపతి కోరారు. మండల కేంద్రంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. మార్చి 5న మందకృష్ణ కరీంనగర్ వస్తున్నారని, ఈ సమావేశానికి మండలం నుంచి అధిక సంఖ్యలో రావాలని కోరారు. అనంతరం ఎమ్మార్పీఎస్ మండల అడహక్ కమిటీ ఏర్పాటు చేశారు. అధ్యక్షుడిగా ఎర్రోల్ల శంకర్, ఉపాధ్యక్షులుగా బెజుగం రాములు, బరుకుటం బాలమల్లు, ప్రధాన కార్యదర్శిగా మంగలి బాలరాజు, జిల్లెల్ల స్వామి, కార్యదర్శిగా బండమీది దేవయ్య, కోశాధికారిగా మోహిన్‌కుంట రాజు, గౌరవ సలహాదారులుగా ఇరిగి భాను, భీంరావు ఎన్నికయ్యారు.

ఘనంగా మల్లన్న పట్నాలు



రుద్రంగి: మండలంలో మల్లన్న పట్నాలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆదివారం మండలకేంద్రంలో పట్నాలు వేసుకునే భక్తులు బోనాలతో వెళ్లి పుట్ట బంగారం తీసుకువచ్చి ప్రత్యేక పూజలతో పట్నాల కార్యక్రమం జరుపుకున్నారు. ఒగ్గు కథను కాలనీవాసులు ఆసక్తిగా తిలకించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో ప్రత్యేక పూజలు



ఆలయం వద్ద మార్కండేయనగర్ కాలనీవాసులు

వేములవాడ: పట్టణంలోని 25వ వార్డుకు చెందిన మార్కండేయనగర్ కాలనీవాసులు ఆదివారం ఏడుపాయల వనదుర్గ అమ్మవారి ఆలయాన్ని సందర్శించారు. కౌన్సిలర్ గూడూరి లక్ష్మి భర్త గూడూరి మధు ఆధ్వర్యంలో కాలనీవాసులంతా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

బూత్ కమిటీలను బలోపేతం చేయాలి



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): బూత్ కమిటీలను బలోపేతం చేయాలని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య అన్నారు. మండలకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం ఆయన మాట్లాడారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో బూత్‌స్థాయి నుంచి మండలస్థాయి కార్యకర్తలు సిద్ధంగా ఉండాలన్నారు. జిల్లాలోని ఎల్లారెడ్డిపేట, గంభీరావుపేట, వీర్నపల్లి మండలాల్లో బూత్ కమిటీలను బలోపేతం చేయాలన్నారు. పార్టీ సీనియర్ కార్యకర్తలను ప్రభుత్వం తప్పకుండా గుర్తిస్తుందన్నారు. సమావేశంలో మండల అధ్యక్షుడు సద్ది లక్ష్మారెడ్డి, నాయకులు గౌస్, బాబు, బుచ్చాగౌడ్, రాములు, రాజు నాయక్, తదితరులు పాల్గొన్నారు.

'పల్లె' వైద్యం అందేదెప్పుడో?



దమ్మన్నపేటలో ప్రారంభానికి నోచుకోని పల్లె దవాఖాన



గంభీరావుపేటలో మూసి ఉన్న పల్లె దవాఖాన

- మండలంలో నాలుగు పల్లె దవాఖానాలకు భవనాలు మంజూరు
- గంభీరావుపేట, దమ్మన్నపేటలో పూర్తయినా అందని వైద్యసేవలు
- మరో రెండుగ్రామాల్లో ఇంకా మొదలు కాని పనులు

ప్రజలకు వైద్యసేవలను మరింత చేరువ చేయాలన్న ఉద్దేశంతో ఏర్పాటు చేసిన పల్లె దవాఖానాలు అలంకారప్రాయంగా మారుతున్నాయి. గ్రామీణ వైద్యాన్ని బలోపేతం చేస్తూ గత ప్రభుత్వం పల్లె దవాఖానాలు ప్రారంభించింది. లింగన్నపేట ప్రాథమిక ఆరోగ్యకేంద్రం పరిధిలో పది ఆరోగ్య ఉపకేంద్రాలు ఉన్నాయి. వీటిలో ఆరు కేంద్రాలకు మాత్రమే పక్కా భవనాలు ఉన్నాయి. మిగతావి అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి.

గంభీరావుపేట(సిరిసిల్ల): కేంద్రప్రభుత్వం ఎన్‌హెచ్ఎంఎఫ్ పథకం కింద మండలంలో నాలుగు పల్లె దవాఖానాల నిర్మాణానికి నిధులు మంజూరు చేసింది. మండలకేంద్రంతో పాటు దమ్మన్నపేట, ముస్తఫానగర్, లింగన్నపేట గ్రామాల్లో పల్లె దవాఖానాలు నిర్మించాల్సి ఉంది. అయితే గంభీరావుపేట, జగదాంబ తండాలో భవన నిర్మాణ పనులు పూర్తయినా దవాఖానా తలుపులు ఇంకా తెరచుకోవడం లేదు. మండలకేంద్రంలోని పల్లె దవాఖానను అప్పటి సర్పంచ్ కటకం శ్రీధర్ పంతులు చేతులమీదుగా రెండునెలల క్రితం ప్రారంభించారు. కానీ ఇప్పటి వరకు భవనంలో వైద్య సేవలు అందడం లేదు. జగదాంబ తండాలో భవన నిర్మాణ పనులు పూర్తయి నెలలు గడుస్తున్నా ప్రారంభానికి నోచుకోవడం లేదు. ముస్తఫానగర్, లింగన్నపేట గ్రామాల్లో భవన నిర్మాణాల పనులకు మోక్షం కలగడం లేదు. ఉన్నతాధికారులు స్పందించి పూర్తయిన భవన నిర్మాణాలను వెంటనే ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని, మొదలుకాని చోట్ల పనులు ప్రారంభించాలని కోరుతున్నారు.

పనులు ప్రారంభించాలి



ముస్తఫానగర్ గ్రామంలోని హెల్త్ సబ్ సెంటర్‌కు కొత్త భవనం మంజూరైంది. నెలలు గడుస్తున్నా నిర్మాణ పనులు మాత్రం ప్రారంభించడం లేదు. అధికారులు చర్యలు తీసుకొని భవన నిర్మాణ పనులు త్వరగా ప్రారంభించాలి. వైద్యసేవల కోసం వెళ్లే ప్రజలు పక్కా భవనం లేకపోవడంతో తీవ్ర ఇబ్బంది పడుతున్నారు.

– కృష్ణకాంత్ యాదవ్, ముస్తఫానగర్

త్వరలోనే వైద్య సేవలు



కొత్తగా నిర్మించిన జగదాంబ తండా, గంభీరావుపేట పల్లె దవాఖానా భవనాలను సంబంధిత శాఖ కాంట్రాక్టర్లు మాకు అప్పగించలేదు. గంభీరావుపేటలో ప్రారంభించినా భవనం అప్పగించలేదు. పంచాయతీరాజ్‌శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్తాం. త్వరలోనే వైద్య సేవలు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటాం.

–వేణుగోపాల్‌రెడ్డి, పీహెచ్‌సీ వైద్యాధికారి, లింగన్నపేట

మహాకుంభాభిషేకం అభినందనీయం



మాట్లాడుతున్న ప్రభుత్వవిప్ ఆది శ్రీనివాస్

వేములవాడ: పట్టణంలో మహాకుంభాభిషేకం పేరుతో ప్రత్యేక యాగాలు నిర్వహించడం ఈ ప్రాంతానికి గర్వకారణమనీ, ప్రభుత్వవిప్ ఆది శ్రీనివాస్ అన్నారు. ఆదివారం పట్టణంలోని ఆర్యవైశ్య నిత్యాన్నదాన సత్రంలో జరుగుతున్న సామూహిక షష్టిపూర్తి, మహా కుంభాభిషేకం, ఇతర పూజా కార్యక్రమాలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. పలు ప్రాంతాలకు చెందిన స్వామిజీలు ఈ ప్రాంతంలో అడుగుమోపడం ఎంతో శుభపరిణామమన్నారు. కార్యక్రమంలో సత్రం నిర్వాహకులు, స్థానికులు, పురప్రముఖులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్యులు రాజకీయంగా ఎదగాలి

వేములవాడ: ఆర్యవైశ్యులు రాజకీయంగా ఎదగాలని టూరిజం మాజీ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్ అన్నారు. పట్టణంలోని శ్రీ రాజరాజేశ్వర క్షేత్ర ఆర్యవైశ్య వాసవి నిత్యాన్నసత్రం ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన లిఫ్ట్ ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వాసవిమాతని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం 60 ఏళ్లు దాటిన 108 మంది ఆదర్శ దంపతులకు జరిగిన షష్టిపూర్తి మహోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఐవీఎఫ్ సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు కట్కూరి శ్రీనివాస్, ఐవీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాడిశెట్టి కృపాల్, నాయకులు నగుబోతు రవీందర్, దైత కుమార్, రాజు తదితరులు పాల్గొన్నారు.

క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలి



క్రీడాకారులకు క్రికెట్ కిట్లు అందిస్తున్న యాదగిరి

చందుర్తి (వేములవాడ): యువత చదువుతో పాటు క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని కరీంనగర్ జిల్లా క్రికెట్ అసోషియేషన్ అధ్యక్షుడు యాదగిరి అన్నారు. మండలకేంద్రంలో ఆదివారం క్రీడాకారులకు క్రికెట్ కిట్లు ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడలు శారీరీక దృఢత్వానికి దోహదపడతాయన్నారు. యువత క్రీడలపై ఆసక్తి పెంచుకొని నచ్చిన క్రీడల్లో రాణించాలన్నారు. కార్యక్రమంలో పిట్టల బాబు, హైమద్, దేవస్వామి, సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

సంకల్ప యాత్రను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న జక్కుల తిరుపతి

వేములవాడరూరల్: రాష్ట్ర బీజేపీ శాఖ మేరకు వచ్చే నెల 2న నిర్వహించనున్న విజయ సంకల్పయాత్రను విజయవంతం చేయాలని పార్టీ రూరల్ మండల అధ్యక్షుడు జక్కుల తిరుపతి పిలుపునిచ్చారు. వేములవాడ రూరల్ మండల కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సంకల్పయాత్రలో పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో బూత్‌స్థాయి అధ్యక్షుడు, శక్తి కేంద్రం ఇన్‌చార్జిలు, మోర్చా అధ్యక్షులు, సీనియర్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పోచమ్మ బోనాలు



డప్పుచప్పుళ్ల మధ్య బోనాలతో వెళ్తున్న మహిళలు

కోనరావుపేట: మండలంలోని మల్కపేటలో పోచమ్మ బోనాల పండుగను ఆదివారం ఘనంగా నిర్వహించారు. గ్రామంలో ఇటీవల పోచమ్మ ఆలయాన్ని పునర్నిర్మించి ప్రతిష్ఠాపన ఉత్సవాలు నిర్వహించారు. ఇందులో భాగంగా ఆదివారం అమ్మవారికి బోనాలు తీశారు. ఈ సందర్భంగా బైండ్ల కళాకారుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. పిల్లా పాపలను చల్లంగా చూడాలని, పాడి పంటలు బాగా పంటలు పండాలని కోరుకున్నారు. కరీంనగర్ డెయిరీ చైర్మన్ చల్మెడ రాజేశ్వర్‌రావు, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు చల్మెడ లక్ష్మీనర్సింహారావు, ఎంపీపీ చంద్రయ్యగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

అగ్నికి ఆహుతి..



దగ్ధమైన హరితహారం మొక్కలు

వీర్నపల్లి: మండలకేంద్రం నుంచి రంగంపేటకు వెళ్లే దారి గుండా రోడ్డుకిరువైపులా నాటిన హరిత హారం మొక్కలు శనివారం రాత్రి అగ్నికి ఆహుతి అయ్యాయి. ఎవరో గుర్తు తెలియని వారు నిప్పు పెట్టడంతో మంటలు వ్యాపించాయని స్థానికులు చెబుతున్నారు. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో అక్కడక్కడ మొక్కలు ఎండిపోవడం, పశువులు తినడం, కాలిపోవడం లాంటివి జరుగుతున్నాయని మండలప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు కొత్తగా మళ్లీ మొక్కలు నాటేలా చూడాలని వారు కోరుతున్నారు.

విజ్ఞానయాత్రంలో విద్యార్థులు



రామప్ప ఆలయం వద్ద విద్యార్థులు

గంభీరావుపేట: మండలంలోని ముచ్చర్ల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు ఆదివారం విజ్ఞాన విహారయాత్రకు వెళ్లారు. అందులో భాగంగా రామప్ప ఆలయాన్ని సందర్శించి, కట్టడాలను వీక్షించారు. ఆలయ చరిత్ర గురించి ఉపాధ్యాయులు విద్యార్థులకు ప్రత్యక్ష బోధన ద్వారా వివరించారు. అనంతరం వరంగల్ జిల్లా కోటను సందర్శించారు.

పేదలకు అన్నదానం

వేములవాడ: మై వేములవాడ ట్రస్ట్ ఆధ్వర్యంలో 1032 రోజులుగా రాజన్న ఆలయ ప్రాంతంలోని పేదలకు నిత్యం అన్నదానం నిర్వహిస్తున్నారు. ఆదివారం వందమంది పేదలకు అన్నదానం చేసినట్లు నిర్వాహకులు మధు మహేశ్, పొలాస రాజేందర్, చల్లా సత్తయ్య, గొంగళ్ల రవికుమార్, ప్రశాంత్, సంతోష్, రాహుల్‌లు తెలిపారు.

నలుగురిపై డ్రంకెన్ డ్రైవ్ కేసు

ఎల్లారెడ్డిపేట: మండలంలోని రాచర్లగొల్లపల్లి శివారులో మద్యం తాగి వాహనాలు నడుపుతున్న నలుగురిపై ఆదివారం రాత్రి పోలీసులు డ్రంకెన్‌డ్రైవ్ కేసునమోదు చేశారు. ఎస్సై రమాకాంత్ మాట్లాడుతూ వాహనదారులు మద్యం తాగి వాహనాలు నడిపితే జైలుకు వెళ్లడం ఖాయమన్నారు. రోడ్డు భద్రత నియమాలు పాటించాలని సూచించారు. తనిఖీల్లో ఏఎస్సై కిషన్‌రావు, సిబ్బంది పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



సమావేశమైన పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు

చందుర్తి: మండలంలోని మల్యాల జెడ్పీ పాఠశాలలో 2004–05 లో చదివిన పదో తరగతి పూర్వ విద్యార్థులు సమ్మేళనాన్ని ఆదివారం నిర్వహించారు. ఒకరికొకరు ఆప్యాయంగా పలుకరించుకొని బాగోగులు తెలుసుకున్నారు. పాఠశాలలో చదివిన రోజులను గుర్తుచేసుకొని ఆనందంగా గడిపారు. అనంతరం తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో అప్పటి ప్రధానోపాధ్యాయుడు శంకరయ్య, ఉపాధ్యాయులు ప్రభాకర్, హరికిషన్, శ్రీనివాస్ రెడ్డి, షరీఫ్, దేవేందర్, వెంకటేశ్వర్లు, సుధ చంద్రబాబు, ప్రణయ్‌కుమార్, మమత, గౌమి, జహంగీరర్, మధుసూదన్, అనిల్, పూర్వ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.


కాంగ్రెస్‌లో చేరిక



పార్టీలోకి ఆహ్వానిస్తున్న కేకే మహేందర్‌రెడ్డి

తంగళ్లపల్లి(సిరిసిల్ల): మండలంలోని కస్బేకట్కూర్ మాజీ సర్పంచ్, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు పొన్నం లక్ష్మణ్ గౌడ్ ఆదివారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జలగం ప్రవీణ్ టోని, జెడ్పీటీసీ పూర్మాని మంజుల రాంలింగా రెడ్డి ఆధ్వర్యంలో నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే.మహేందర్ రెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు. ఈ సందర్భంగా కేకే.మహేందర్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తుందన్నారు. కాంగ్రెస్ నాయకులు ఆకునూరి బాలరాజు, గుగ్గిళ్ల శ్రీకాంత్ గౌడ్, పొన్నాల పరుశరాములు, గంభీరావుపేట ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.

అయోధ్యకు తరలివెళ్లిన ఆవునూర్ గ్రామస్తులు



అయోధ్యలో ఆవునూర్ మహిళలు

ముస్తాబాద్: అయోధ్య బాలరాముడి దర్శనానికి మండలంలోని ఆవునూర్ గ్రామానికి చెందిన పలువురు భక్తులు తరలివెళ్లారు. ప్రత్యేక భోగిలో అయోధ్యకు వెళ్లిన తమకు అన్నిఏర్పాట్లు ప్రభుత్వం చేసిందని సంఘం నాయకురాలు జ్యోతి తెలిపారు.

చలివేంద్రం ప్రారంభం

ఎల్లారెడ్డిపేట: మండలంలోని వెంకటాపూర్‌లో ఆర్‌సీటీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం చలివేంద్రాన్ని ప్రారంభించారు. మాజీ సర్పంచ్ కోల అంజ మ్మ, ఉపసర్పంచ్ మేడిశెట్టి బాలయ్య, ఎంపీటీసీ మామిండ్ల తిరుపతి బాబు, ఫౌండేషన్ సభ్యులు, సన్ని, రాగు ల చరణ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

వృద్ధులకు నిత్యావసరాలు, పండ్లు పంపిణీ



వృద్ధురాలికి పండ్లు అందజేస్తున్న సౌజన్య

ఎల్లారెడ్డిపేట: మృతిచెందగా తన తండ్రి సురేందర్‌రెడ్డి పుట్టినరోజు సందర్భంగా ఓ యువతి మండలకేంద్రంలోని వృద్ధాశ్రమంలో నెలరోజులకు సరిపడా నిత్యావసరాలు, పండ్లు పంపిణీ చేసింది. అంతేకాకుండా వారికి చికెన్‌తో భోజనం అందించింది. ఎల్లారెడ్డిపేట మండలకేంద్రానికి చెందిన నేవూరి సురేందర్ రెడ్డి ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో కాంటింజెంట్ వర్కర్‌గా పనిచేస్తూ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. తన తండ్రిని గుర్తుచేసుకుంటూ వృద్ధులకు నిత్యావసరాలు, పండ్లు పంపిణీ చేసింది. ఈ సందర్భంగా సౌజన్యను పలువురు అభినందించారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ నాయకులు బుచ్చిలింగు, సంతోష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిపై కేసు నమోదు

బోయినపల్లి(చొప్పదండి): అజాగ్రత్తగా వాహనం నడిపి రోడ్డు ప్రమాదానికి కారణమైన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. ఈనెల 18న కొదురుపాక గ్రామానికి చెందిన లచ్చయ్య, అతని కోడలు కావ్య పొలం పని ముగించుకొని టీవీఎస్ ఎక్సెల్‌పై ఇంటికి వెళ్తున్నారు. అదే సమయంలో జగిత్యాల జిల్లా పెగడపల్లి మండలం ఎల్లాపూర్ గ్రామానికి చెందిన గంగాధర్ అజాగ్రత్తగా బైక్ నడిపి లచ్చయ్య వాహనాన్ని ఢీకొ ట్టాడు. ఇద్దరికి తీవ్రగాయాలుకాగా లచ్చయ్య కుమారుడు వేణు ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

నిర్మించినా.. నిరుపయోగమే

- వైకుంఠధామాల్లో సౌకర్యాలు కరువు
- రూ.లక్షలాది రూపాయలతో నిర్మాణాలు
- పట్టించుకోని అధికారులు



జయవరంలో మూలవాగు పక్కన నిర్మించిన వైకుంఠధామం

వేములవాడరూరల్: వేములవాడ మండలంలోని మల్లారంలో మూలవాగులోనే వైకుంఠధామాలను నిర్మించారు. గత వర్షాకాలంలో నీటి ప్రవాహంతో పూర్తిగా దెబ్బతింది. ఇప్పటివరకు ఎలాంటి మరమ్మతులు చేపట్టలేదు. గ్రామంలో ఎవరైనా మృతిచెందితే మూలవాగులోనే పాత పద్ధతిలో దహన సంస్కారాలు నిర్వహిస్తున్నారు. గ్రామాల్లో ఎవరైనా మృతిచెందితే దహన సంస్కారాలు నిర్వహించేందుకు గత ప్రభుత్వం రూ.లక్షలాది రూపాయలతో వైకుంఠధామాలు నిర్మించింది. కానీ చాలాగ్రామాల్లో అవి ఉపయోగంలో లేవు. ఇప్పటికీ గ్రామంలో ఎవరైనా మృతిచెందితే పాత పద్ధతిలోనే అంత్యక్రియలు నిర్వహిస్తున్నారు. కొన్నిగ్రామాల్లో ప్రభుత్వ స్థలాలు లేకపోవడంతో కొందరు వారి సొంత స్థలంలోనే కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. వేములవాడ రూరల్ మండలంలోని 17 గ్రామాల్లో వైకుంఠధామాలు నిర్మించారు. ఇప్పటివరకు ఎక్కడ ఉపయోగంలో లేవు. కొన్నిప్రాంతాల్లో విద్యుత్, నీటిసౌకర్యం కూడా లేదు. కొన్నిగ్రామాల్లో నిర్మించిన వైకుంఠధామాలు గత వర్షాకాలంలో మూలవాగులో కొట్టుకుపోయాయి. ఇప్పటివరకు మళ్లీ నిర్మించలేదు. లక్షలాది రూపాయలతో గత ప్రభుత్వం మంజూరు చేయగా నిర్మాణంలో మాత్రం అధికారులు, పాలకుల నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. కొన్నిప్రాంతాల్లో చెరువులు, కుంటల్లో నిర్మించడంతో వర్షాకాలంలో నీరుచేరి అక్కడికి వెళ్లలేని పరిస్థితి. ప్రజాప్రతినిధులు, మండలస్థాయి అధికారులు వాటి నిర్మాణంలో మాత్రం ముందుచూపు లేకుండా పనులు చేయడంతో ఎక్కడా ఉపయోగంలో లేవని గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు.

విలీన గ్రామాల్లో సైతం..

వేములవాడ మున్సిపాలిటీలో విలీనమైన గ్రామాల్లోనూ వైకుంఠధామాలు లేక వార్డు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గతంలో గ్రామ పంచాయతీగా ఉన్న శాత్రాజుపల్లి, అయ్యోరుపల్లి, జయవరంతో పాటు నాంపల్లి, తిప్పాపూర్, కోనాయపల్లి గ్రామాలున్నాయి. ఇక్కడ మున్సిపాలిటీ తరఫున వైకుంఠధామాలు నిర్మించాలని తీర్మానాలు చేసి స్థలాలు గుర్తించినా ఇప్పటివరకు ఎక్కడా పూర్తిచేయలేదు. శాత్రాజుపల్లిలో రూ.2కోట్లతో పనులు ప్రారంభించినా ఇంకా పూర్తికాలేదు.

ఇప్పటికీ పూర్తికాలేదు



వేములవాడ మున్సిపాలిటీలో విలీనమైన శాత్రాజుపలిలో వైకుంఠధామాలు లేక వార్డు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడ పనులు ప్రారంభించినా ఇప్పటివరకు పూర్తికాలేదు. అధికారులు వెంటనే పనులు జరిగేలా చర్యలు తీసుకోవాలి.

– కొట్టాల ఆదిరెడ్డి, 2వ వార్డు, వేములవాడ

నీటి ప్రవాహానికి కొట్టుకెళ్లింది



గ్రామంలో నిర్మించిన వైకుంఠధామం ఇప్పటివరకు ఉపయోగంలోకి రాలేదు. మూలవాగులో నిర్మించడంతో గత వర్షాకాలంలో నీటి ప్రవాహంతో కొట్టుకుపోయింది. మళ్లీ ఎలాంటి పనులు జరగలేదు. లక్షలాది రూపాయలు వృథా అయ్యాయి.

– తోకల శ్రీనివాస్, రైతు, మల్లారం

నిరుపయోగంగా మారాయి



వైకుంఠధామాలు నిర్మించినా నిరుపయోగంగా మారాయి. సరైన ప్రాంతంలో గుర్తించి నిర్మించకపోవడం, పూర్తిస్థాయిలో పనులుకాక, సౌకర్యాలు కల్పించకపోవడంతో మండలంలో చాలాగ్రామాల్లో ఎక్కడా ఉపయోగంలోకి రాలేదు.

– చెట్టిపల్లి రవికిషోర్, నాగాయపల్లి